
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

చిత్తూరు జిల్లా వార్తలు
శనివారం 19 అక్టోబరు 2024

నిలిచిన అడవిపల్లె ప్రాజెక్టు పనుల్లో కదలిక

గత టీడీపీ హయాంలోనే 75 కి.మీ పనుల పూర్తి

30 కిమీ పనులను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం


అడవిపల్లె రిజర్వాయర్

వేసవికైనా పూర్తయ్యేనా?

చిత్తూరు ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చేందుకు తలపెట్టిన అడవిపల్లె ప్రాజెక్టు పనుల్లో మళ్లీ కదలిక వచ్చింది. అమృత్ పథకం కింద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.250 కోట్ల వ్యయంతో అడవిపల్లె నుంచి చిత్తూరుకు పైపులైన్ల ద్వారా తాగు నీరందించే పథకానికి శ్రీకారం చుట్టారు. 75 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను గాలికొదిలేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆగిన పనులను పూర్తి చేసి వచ్చే ఏడాది వేసవికల్లా చిత్తూరు నగర ప్రజలకు తాగునీరందించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి.


రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు నగర జనాభా సుమారు రెండు లక్షలు. రోజుకు 27 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉంది. ఇందులో ఎన్టీయార్ జలాశయం రోజుకు 5 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ల నీరు), 450 బోర్ల నుంచి 22 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. వర్షాలు పడక ఎన్టీయార్ జలాశయం ఎండిపోతే సమీప ప్రాంతాల్లోని రైతుల బావులతో పాటు అదనంగా బోర్లను డ్రిల్లింగ్ చేయడం.. అరకొర నీటిని సరఫరా చేయడం రివాజుగా మారింది.ఈ పరిస్థితుల్లో పలువురు ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తూరు ప్రజల తాగునీటి సమస్యను పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో.. 2018లో అమృత్ పథకం ద్వారా సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టింది.

● రూ.250 కోట్లు.. 95 కిలోమీటర్ల పైపులైను

పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు పైపులైన్ల ద్వారా 37ఎంఎల్‌డీ నీటిని తీసుకురావడానికి 2018లో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి నివేదికలను రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి పంపడంతో అమృత్ పథకం కింద రూ.250 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపి నిధులను విడుదల చేసింది. పనులను ప్రారంభించిన అధికారులు అడవిపల్లె రిజర్వాయర్ నుంచి పూతలపట్టు మండలంలోని ఎ.రంగంపేట క్రాస్ వరకు అంటే సుమారు 75 కిలోమీటర్ల వరకు పైపులైన్ పనులను పూర్తి చేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడం టీడీపీ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడంతో పైపులైను పనులను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది.గత ఎన్నికల్లో చిత్తూరు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అడవిపల్లె రిజర్వాయర్ నుంచి పైపులైను కనెక్షన్ పనులు పూర్తి చేసి చిత్తూరు నగరానికి తాగునీటి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు దొరబాబు, కటారి హేమలత, కాజూరి బాలాజీ తదితర నాయకులతో కలసి మే 1వ తేదీన అడవిపల్లె రిజర్వాయర్‌ను సందర్శించారు.ఈ నేపథ్యంలో ఆగిపోయిన పైపులైన్ పనులను ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం రాగానే ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రాజెక్టు నుంచి 0.785 టీఎంసీ నీటి ఉపసంహరణ, ఇంటెక్‌వెల్ అనుమతి కోసం జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ నుంచి ప్రభుత్వానికి లేఖ పంపించాల్సి ఉంది.ఎ.రంగంపేట క్రాస్ నుంచి చిత్తూరు నగరానికి 15 కిలోమీటర్ల వరకు పైపులైన్ వేయడానికి జాతీయ రహదారుల శాఖ అనుమతి నిరాకరించగా ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు. అలాగే దామల చెరువులోని పుదిపట్లబయలులో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి తిరుపతి ఆర్డీవోతో, పాకాల తహసీల్దార్‌తో సంప్రదిస్తున్నారు.

వేసవినాటికి పూర్తి చేసేందుకు కృషి



గత ఐదేళ్ల కాలంలో అడవిపల్లె ప్రాజెక్టు పనులు సాంకేతిక కారణాలతో ముందుకు పోలేదు. ప్రస్తుతం వివిధ దశల్లో ఆగిపోయిన పనుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.మా ప్రయత్నాలు ఫలిస్తే వచ్చే ఏడాది వేసవినాటికి చిత్తూరు ప్రజలకు అడవిపల్లె ప్రాజెక్టు నుంచి తాగునీటిని అందిస్తాం.

-పుష్పగిరి నాయక్, పబ్లిక్ హెల్త్ డీపీహెచ్ఈవో, చిత్తూరు

మాట నిలబెట్టుకుంటాం



ఎన్నికల ప్రచార సమయంలో ఇంటింటా తిరిగినప్పుడు తాగునీటి సమస్య అర్థమైంది. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి పైపులైను పనులు పూర్తి చేస్తే చిత్తూరు నగరానికి నీళ్లు వస్తాయని గుర్తించి, రిజర్వాయర్‌ను సందర్శించాను. సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే తాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చాను.మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు నిత్యం ఫాలోఅప్ చేస్తున్నాం.

- గురజాల జగన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే



విశ్వేశ్వరాలయ గోపురానికి తప్పిన ముప్పు

● పిడుగుపాటుతో దక్షిణామూర్తి విగ్రహానికి పగుళ్లు

కల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ సమీపంలో గురువారం రాత్రి పిడుగు పడింది. దీని ప్రభావంతో ఆలయ గోపురంపై నిర్మించిన దక్షిణామూర్తి విగ్రహానికి పగుళ్లు ఏర్పడ్డాయి. గోపురంపై నుంచి కొన్ని పెచ్చులు ఊడి కింద పడ్డాయి. ఉదయం ఆలయానికి చేరుకున్న ప్రధాన అర్చకులు ఫణిప్రకాష్‌శర్మ ఆలయం ముందు పెచ్చులను గమనించి ఆలయ శిఖరాన్ని పరిశీలించారు. గోపురంపై నిర్మించిన దక్షిణామూర్తి ముఖంపై పగుళ్లు ఏర్పడడాన్ని గుర్తించారు.పిడుగుపాటు ప్రభావంతో విగ్రహం దెబ్బతిందని, గోపురానికి ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.


దక్షిణామూర్తి విగ్రహానికి ఏర్పడిన పగుళ్లు - ఆలయ గోపురం పైనుంచి ఊడిపడిన పెచ్చులు

ఐరాలలో 58.2 మి.మీ వర్షపాతం


ఐరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద వంతెనపై గార్గేయనది నీటి ప్రవాహం

ఐరాల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది.గార్గేయనది ప్రారంభమయ్యే అటవీ ప్రాంతంలో సుమారు పది పదున్ల వర్షం కురవడంతో నదీ ప్రవాహం పెరిగింది. దీంతో తహసీల్దార్ కార్యాలయం వద్ద వంకపై వాహనాలను, ప్రజలను తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎస్‌ఐ నరసింహులు అనుమతించలేదు. ఓ ఆర్టీసీ బస్సు, కొన్ని ప్రైవేటు ఫ్యాక్టరీల బస్సులను సుమారు గంట సమయంపైగా నిలిపి వేశారు. ఉదయానికల్లా నదీప్రవాహం తగ్గడంతో వాహనాలను, ప్రజలను వంకపై ఉన్న నేల వంతెనపై అనుమతించారు. ప్రభుత్వం ఇప్పటికైనా నదిపై నేల వంతెన స్థానంలో పెద్ద వంతెనను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

విజయపురంలోనూ...

విజయపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కుంభవృష్టి కురిసింది. దీంతో జగన్నాథపురం వంకలో వరద ఉధృతి పెరగడంతో పంట పొలాలు జలమయం అయ్యాయి.


జగన్నాథపురం వంకలో పెరిగిన వరద ఉధృతి

జిల్లావ్యాప్తంగా మోస్తరు వాన

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడచిన 24 గంటల్లో నాలుగు మండలాల్లో మినహా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఐరాల మండలంలో 58.2 మి.మీ, అత్యల్పంగా ఎస్ఆర్‌పురం, చిత్తూరు మండలాల్లో 2.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మండలాల వారీగా బంగారుపాళ్యంలో 20.4మి.మీ, చౌడేపల్లిలో 18.6, పాలసముద్రంలో 17.2, పెనుమూరులో 16.8, సదుంలో 16.6, సోమలలో 14.6, చిత్తూరు రూరల్‌లో 11.8, కార్వేటినగరం, గంగవరంలో 10.6, వెదురుకుప్పంలో 10.2, పెద్దపంజాణిలో 9.8, పుంగనూరు, బైరెడ్డిపల్లి, గుడిపాలలో 9.2, యాదమరిలో 8.8, రొంపిచెర్లలో 7.8, పులిచెర్లలో 7, పూతలపట్టు, వి.కోటలో 5.8, జీడీనెల్లూరులో 5.4, తవణంపల్లెలో 5, కుప్పంలో 4.8, పలమనేరులో 4.6, నగరిలో 4, నింద్రలో 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది.


రెడ్డివారిపల్లె వద్ద గార్గేయ నది ఉధృత ప్రవాహంతో స్తంభించిన రాకపోకలు

సోమలలో భారీవర్షం

● పొంగి ప్రవహించిన గార్గేయ నది ● కొట్టుకుపోయిన కల్వర్టులు
● పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

సోమల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో మూడు చోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. ఏడు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి.గార్గేయ నది ప్రవాహవేగం పుంజుకుంది. పెద్దఉప్పరపల్లె నుంచి రెడ్డివారిపల్లెకు వెళ్లే మార్గంలో గార్గేయ నదిపై నిర్మించిన తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయింది. పెద్దఉప్పరపల్లె నుంచి పేటూరు, బసవపల్లె, పొలికిమాకులపల్లె, ఎర్రగుంతలపల్లె, బోనమంద, చిన్నకమ్మపల్లె, దుర్గంకొండ గ్రామాలకు పోయే మార్గంలో పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీ వద్ద కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. పలు ప్రాంతాల నుంచి వంకలు గార్గేయ నదిలో కలవడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో పలు గ్రామాల ప్రజలు పెద్దఉప్పరపల్లెకు రాలేకపోతున్నారు. శుక్రవారం పెద్దఉప్పరపల్లెలో జరిగే వారపు సంతకు రైతులు,వ్యాపారులు కూరగాయలు తీసుకుపోలేకపోతున్నారు.

పలు పంటలకు తీవ్ర నష్టం

అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షం కారణంగా వేరుశనగ పంట కుళ్లిపోతోంది. తొలుత వర్షం లేక పంటకు నష్టం జరగ్గా అంతో ఇంతో పండిన పంట కూడా ఈ వర్షం పాలయింది. భూమిలో ఉన్న వేరుశనగ పంట మొలకలు వస్తుండగా, ఉబ్బడి కావాల్సిన వేరుశనగ కాయలు నల్లగా మారి బూజుపడుతున్నాయి. మాగిన టమోటా పంటను గురువారం రాత్రి కురిసిన వర్షంతో మార్కెట్‌కు తరలించడానికి వీల్లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.వరి పైర్లకు కూడా కోతల సమయంలో భారీ వర్షంతో నష్టం వాటిల్లింది.గార్గేయనది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో శుక్రవారం ఎస్‌ఐ శివశంకర సిబ్బందితో కలసి తెగిన కల్వర్టులను పరిశీలించి ఆ ప్రాంతం వైపు ప్రజలు వెళ్లకుండా చూస్తున్నారు. రైతులు కూడా పొలాల వద్దకు వెళ్లేందుకు గార్గేయ నది వైపు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.భారీ వర్షాలతో పరిస్థితిని అంచనా వేసేందుకు పంచాయతీ రాజ్ ఎస్ఈ శంకరనారాయణ, ఈఈలు చంద్రశేఖర రెడ్డి, నాగరాజ, డీఈ కరుణాకర్ మండలస్థాయి అధికారులతో కలసి శుక్రవారం దెబ్బతిన్న పంటలను, తెగిన కల్వర్టులను పరిశీలించారు.


పెద్దఉప్పరపల్లె -చిన్నకమ్మపల్లె బోనమంద మార్గంలో ప్రవహిస్తున్న వంక


బసవపల్లె వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు


నదిపై వంతెన కట్టడమే పరిష్కారం



గార్గేయ నదిపై వంతెన కట్టడమొకటే సమస్యకు పరిష్కారం. ఏటా వర్షాకాలంలో పెద్దఉప్పరపల్లె నుంచి పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. పాఠశాలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.తాత్కాలిక కల్వర్టులతో ఇబ్బందులు పడుతూనే వున్నాం.

- ఉమ్మిటి వినోద్‌కుమార్ , పెద్దఉప్పరపల్లె








గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టీడీఎల్పీ సమావేశంలో పాల్గొన్న చిత్తూరు,తిరుపతి జిల్లాల ఎమ్మెల్యేలు- సమావేశానికి వస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్, పుంగనూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రా రెడ్డి -ప్రసంగిస్తున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు



పండగ సెలవు కోసం..

నరక చతుర్దశిని అధికారిక సెలవుదినంగా ప్రకటించాలన్నది ఈ విద్యార్థుల వినతి. దీనికోసం తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె సర్కిల్‌లో శుక్రవారం సాయంత్రం పోస్టుకార్డులను చూపారు. వీటిని సీఎం చంద్రబాబుకు పంపనున్నట్లు హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల తెలిపారు. గత వైసీపీ పాలనలో హిందూ వ్యతిరేకతతో పండుగ సెలవును రద్దు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ సెలవును పునరుద్ధరించాలని కోరారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

ఎలా పోవాలబ్బా?

వాహనం వస్తే దిగబడుతుంది. ద్విచక్ర వాహనమైతే జారుతుంది. ఇలాంటి రోడ్డులో ఎలా పోవాలబ్బా అంటూ ఆవేదన చెందుతున్నారు ఏర్పేడు మండలం పాగాలి గ్రామస్తులు. శ్రీకాళహస్తి రోడ్డులో నుంచి ఆ ఊరు వెళ్లే 2.5 కిలోమీటర్లు ఇదే పరిస్థితి. 2019కి ముందు టీడీపీ హయాంలో రోడ్డుకు భూమి పూజ చేసినా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదు. దీంతో వర్షమొస్తే నడకయాతన తప్పడం లేదంటున్నారు స్థానికులు.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి



బాక్స్‌క్రికెట్!

కుమ్మేసుకోవచ్చు



గేమ్స్ అంటే ఈతరం పిల్లలు మొబైల్‌లో ఆడుకునేవి అనుకుంటారు. ప్రభుత్వ బడుల్లో మైదానాలు అంతరించిపోయి, ఆటస్థలాలు లేని ప్రయివేటు బడుల హవా మొదలయ్యాక ఏర్పడిన దౌర్భాగ్యం ఇది. గుడ్డిలో మెల్లలా క్రికెట్ ఆట ఒక్కటీ ఈతరం పిల్లలను ఆకర్షిస్తూనే ఉంది. ఆసక్తి ఉన్నా, సమయం కుదుర్చుకున్నా ఆడుకునేదానికి స్థలాలు ఏవీ? రియల్‌ఎస్టేట్ కబళించేసిన నగరాల్లో ఇదో పెద్ద సమస్య. ఇందుకు విరుగుడుగా పరిమిత స్థలంలోనే క్రికెట్ ఆడుకునే, నేర్చుకునే మైదానాలు మొదలయ్యాయి. దీన్నే బాక్స్ క్రికెట్ అంటున్నారు. తిరుపతిలో ఆరు బాక్స్‌క్రికెట్ క్లబ్‌లు ఉన్నాయి. గంటకి ఇంతని అద్దె చెల్లించి వీటిలో ఆడుకోవచ్చు. గెస్ట్‌లైన్‌రోడ్డు(అన్నమ్య మార్గ్)లో కొత్తగా సామ్స్ క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌లో 2 క్రికెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. యువత టీంలుగా గానీ, కుటుంబాలుగా గానీ ఆడుకోవచ్చు. కాకపోతే ముందుగా టైంస్లాట్ బుక్ చేసుకోవాలి.

- తిరుపతి (జీవకోన)





ప్రత్యేకతలు:

ఈడ్చి కొడితే బాల్ పక్కింటి కిటికీ అద్దాలు బద్దలు చేస్తుందనే భయం లేదు. బాక్స్‌టైప్ నెట్ బాల్‌ను బయటకు వెళ్లనివ్వదు.
రాత్రి వేళల్లోనూ ప్రత్యేక లైట్ల వెలుగులో క్రికెట్ ఆడుకోవచ్చు.



అద్దె ఎంత?:

పగలైతే గంటకు రూ.650.
రాత్రి అయితే రూ.850.
(15శాతం దాకా డిస్కౌంట్ వెసులుబాటు ఉంది)
వివరాలకు: 9059268386



ముగింపు దశలో ముక్కంటి ఆలయ లీకేజీ పనులు

- దాతృత్వం చాటుకున్న పుణె వ్యాపారి



శ్రీకాళహస్తి, అక్టోబరు 18: శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పు లీకేజీని అరికట్టే పనులు ముగింపు దశగా వచ్చాయి. కొద్ది సంవత్సరాలుగా ముక్కంటి ఆలయ పైకప్పు లీకేజీ ఏర్పడటంతో సమస్య నెలకొంది. మైసూరులోని జాతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ముక్కంటి ఆలయ లీకేజీలపై స్పందించారు. పుణెకు చెందిన వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు వెంకటేశ్వరరావును లీకేజీ పనులను చేపట్టాల్సిందిగా సూచించారు. దీంతో ఏడాది క్రితం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పుణెకు చెందిన ఐఐటీ నిపుణుల బృందంతో పలుదఫాలుగా అధ్యయనం చేయించారు. అత్యంత శాస్త్రీయమైన పురాతన శైలిలో పైకప్పునకు మరమ్మతులు చేసేందుకు రెండు నెలల క్రితం దాత పనులు ప్రారంభించారు. నిపుణుల పర్యవేక్షణలో సున్నం, ఇటుకలపొడి, ఇటుక ముక్కలు, ప్రకృతిలో సహజసిద్ధంగా మొక్కల నుంచి సేకరించిన బంక, కరక్కాయపొడి తదితర మిశ్రమాలతో పనులు చేపట్టారు. సుమారు రూ.1కోట్లతో చేపట్టిన ఈ పనులు తుదిదశకు చేరాయి. ఆయన కృషి ఫలితంగా ఇటీవల నాలుగు రోజుల పాటు ఎడతెరపిలేకుండా వర్షాలు కురిసినప్పటికీ ఎక్కడా లీకేజీ కనపబడలేదు.

పంచాయతీ పరిధిలో జీప్లస్ టూ వరకే నిర్మించాలి. ఆపై కట్టాలంటే తుడా అనుమతి తీసుకోవాలి. అలాగని ఈ ప్రాంతంలో భవంతుల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే.. తుడా అనుమతివ్వదు. ఎందుకంటే ఇది హథీరాంజీ మఠం భూములు. అయినా, నిబంధనలకు విరుద్ధంగా తిరపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ తిరుమలనగర్‌లోని మఠం భూముల్లో కళ్లు చెదిరే బహుళ అంతస్థు నిర్మాణాలు చేపడుతున్నారు.

మఠం భూముల్లో

బహుళ అంతస్థులు

- నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు



గాంధీపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 13 లో దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో మఠం భూమిఉంది. ఈ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ తరహా పలు అపార్టుమెంట్లు, పెద్దపెద్ద నివాస భవంతులను నిర్మిస్తున్నారు. గతంలో ఈ భూమిని పలువురు రైతులు మఠం నుంచి 99 సంవత్సరాలకు కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగుచేసేవారు. తమకు సాగు అనుభవం ఉండడంతో అప్పట్లో కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించి రిజిస్ట్రేషన్ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. తర్వాతకాలంలో హైకోర్టు ఈ భూముల్లో రిజిస్ట్రేషన్లు చేపట్టకుండా ఉత్తర్వులను రద్దు చేసినట్లు సమాచారం. ఈసీలో కూడా ఇప్పటికీ హథీరాంజీమఠం భూమిగానే నమోదై ఉంది. ఈ స్థలంలో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టేందుకు పంచాయతీకి అనుమతిచ్చే అధికారం లేదు. అయితే నీరు, లైట్లు, రోడ్లు పంచాయతీవి కావడంతో కొంత మంది నుంచి గతంలో డెవలప్‌మెంట్ ట్యాక్స్ కట్టించుకున్నట్లు తెలిసింది. ఈ భూమిలో తొలుత రేకులషెడ్డు నిర్మించుకున్న కొందరు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పలుకుబడితో ఒత్తిడి తెచ్చి పంచాయతీ డెవలప్‌మెంట్ ట్యాక్స్‌తోపాటు విద్యుత్ మీటర్లనూ తీసుకున్నారని సమాచారం. అదే స్థలంలో పెద్ద భవంతులు నిర్మించాక నాలుగైదేళ్లుగా ఎటువంటి రివైజ్డ్ ట్యాక్స్ కూడా చెల్లించని పరిస్థితి ఉంది. ఇప్పటికీ ట్యాక్స్ రూపంలో పలువురు వేలాదిరూపాయలు బకాయి ఉన్నారు. దీనికి తోడు కొత్తగా చేపట్టిన దాదాపు 40శాతం వరకు నిర్మాణాలకు ఇప్పటికీ పూర్తిగా పంచాయతీ ట్యాక్స్ కూడా చెల్లించలేదని తెలిసింది. తిరుపతినగరపరిధి దాదాపుగా రూరల్‌మండలం వరకు విస్తరించడంతో ఈభూములకు విపరీతమైన డిమాండు ఉంది. దీంతో రైతులు మఠం వద్ద కౌలుకు తీసుకున్న ఈ భూములను పలువురికి విక్రయాలు చేపట్టారు. రైతుల నుంచి పలువురు ఈభూములను కొనుగోళు చేసి భారీ నిర్మాణాలను చేపడుతున్నారు. మఠం భూమి కావడంతో ఇళ్ల నిర్మాణాల అప్రూవల్‌కు అవకాశమే లేదు. అయితే ఈభూమిలో వివిధ రంగాలకు(రాజకీయ, రెవెన్యూ, పోలీసు తదితర) చెందిన వారు నిర్మాణాలు చేపట్టడంతో మఠం, పంచాయతీ అధికారులు ఇటువైపు చూడటం లేదు. అదే పేదలు ఎక్కడో మారుమూల రెండుసెంట్ల స్థలం కొనుగోళు చేసి నిర్మాణాలు చేపడితే వెంటనే వచ్చి కూలదోసే మఠం అధికారులు విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఆపార్టీకి చెందిన కొందరు ద్వితీయ శ్రేణి నేతల కన్ను ఈభూమిపై పడింది. ఇతరుల అధీనంలో ఉన్నభూమిలో దౌర్జన్యంగా ప్రవేశించి ఆక్రమణలకు దిగుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి



'పులికాట్'లో ఒరిగిన టవర్



నిటారుగా నిలబడాల్సి ఈ విద్యుత్తు టవర్.. ఏడాది ఒరిగిపోయి ఉంది. ఇరకం దీవికి విద్యుత్తు సరఫరా కోసం పులికాట్ సరస్సులో రెండు టవర్ల ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి గతేడాది మిచౌంగ్ తుఫాన్ సమయంలో వీచిన గాలులకు పక్కకు ఒరిగిపోయింది. అప్పట్నుంచి అలా.. ఉండిపోయింది. ఇటీవల వాయుగుండం ముప్పు తప్పింది కాని.. పెనుగాలులు వీచుంటే ఈ టవర్ నేలవాలేదే. ఇప్పుడు వానలు.. తుపాన్లు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో విద్యుత్తు టవరు కిందకు ఒరిగిపోతే ప్రమాదమే. మరోవైపు ఇరకం దీవికి విద్యుత్తు సరఫరా కూడా నిలిచిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ టవర్‌ను స్థిరంగా నిలబెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- తడ, ఆంధ్రజ్యోతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు

తిరుమల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించింది. ఈమేరకు రూ.3.96 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక గురువారం 58,637 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,956 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.



సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ చార్జీలు పెంచకండి

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు నెపంతో విద్యుత్ చార్జీలు పెంచరాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ అధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు పెంచి, ఆ భారాన్ని వినియోగదారులపై మోపాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23 వార్షికానికి సంబంధించి సర్దుబాటు చార్జీలు పెంచాలని విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆ సమయంలో ప్రజాభిప్రాయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వినియోగదారుల ప్రయోజనాలు కాపాడాల్సిన నియంత్రణ మండలి నేటి వరకు కాలయాపన చేసి ఇప్పుడు ట్రూఅప్ చార్జీలు పెంచాలని నిర్ణయం తీసుకోవడం ఏమిటని నిలదీశారు. తొందరపాటు చర్యలతో వినియోగదారులపై భారం మోపాలని చూస్తే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, కె.వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, నరేంద్ర, చిన్నబాబు పాల్గొన్నారు.

మద్యం షాపుల యజమానులెవరు?



కొత్తగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

- వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల యజమానుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. జిల్లాలో 227 మద్యం దుకాణాలకు గాను శుక్రవారం వరకు దాదాపు 210 ప్రారంభమయ్యాయి. ఆయా మద్యం షాపులను ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు? వాటి యజమానులు ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వారు? వారి ఆధార్ వివరాలు.. గతంలో పోలీసు కేసులు ఏవైనా ఉన్నాయా అన్న కోణంలో సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో ఉంచి అవసరమైన సమయాల్లో ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే దానికి సంబంధిత దుకాణాలు యజమానులను బాధ్యులుగా చేయడానికి అవకాశం వుంటుందని పోలీసులు చెబుతున్నారు. అన్ని మద్యం దుకాణాలను సంబంధిత పోలీసు స్టేషన్లతో అనుసంధానం చేసే ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నారు.



ఓంకార్, అశ్విన్

స్క్రిప్టులో 'రాజుగారి గది 4'

'రాజు గారి గది4' సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని దర్శకుడు ఓంకార్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం తన తమ్ముడు, హీరో అశ్విన్‌తో కలిసి దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'ఇస్మార్ట్ జోడీ3', 'డ్యాన్స్ ఐకాన్2' షోలు త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. తాను నటించిన ఓ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, త్వరలోనే ఆ వివరాలు వెల్లడిస్తామని అశ్విన్ చెప్పారు.



శ్రీవారి సేవలో అషిక

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం సినీనటి అషిక రంగనాథ్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆమె స్వామి సేవలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆహ్లాదవనం

చిత్తూరు నగరవనంలోని ఎర్రచందనం వృక్షాలు, వివిధ రకాల జంతువులు స్థానికులకు ఆహ్లాదాన్నిస్తున్నాయి. అటవీ శాఖ చిత్తూరు తూర్పు విభాగం పరిధిలోని దాదాపు 300 ఎకరాల విస్తీర్ణంలో ఇది విస్తరించి ఉంది. ఇందులో ఎక్కువగా ఎర్రచందనం వృక్షాలు కనిపిస్తాయి. 1963 నుంచి ఇప్పటి వరకు 23 విడతలుగా ఎర్రచందనం మొక్కలు నాటారు. అలాగే జింక, దుప్పి, నెమళ్లతో పాటు ముళ్ల పంది, అడవి పంది, కుందేళ్లు, కొండచిలువలు, నాగుపాములు, రామచిలుకలు, గద్దలు, గబ్బిలాలకూ ఆవాసంగా మారింది. జముడు కాకి కూడా ఇక్కడ ఉండటం విశేషం. చిల్డ్రన్స్, జింకల పార్కులు ప్రత్యేక ఆకర్షణ.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి



నగరవనం ప్రధాన ద్వారం



నగరవనంలో వాకర్లు

పటిష్ఠ నిఘా, భద్రతకు ప్రాధాన్యం


విలువైన ఎర్రచందనం వృక్ష సంపదతోపాటు జంతువుల సంరక్షణకు పటిష్ఠ నిఘా, భద్రతకు ప్రాధాన్యమిస్తున్నాం. రోజూ రాత్రి సమయాల్లో నగరవనం 15 కిలో మీటర్ల పరిధిలో నిఘా పెంచాం. ఇప్పటికే జంతువులు బయటకు వెళ్లకుండా ఉండటానికి రూ.8.5 లక్షల వ్యయంతో నాలుగు కిలోమీటర్ల పరిధిలో పెరిఫిరల్ ట్రెంచ్ కొట్టారు. రూ.4.5 లక్షల వ్యయంతో 13 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నాలుగు ట్రాక్ కెమెరాలున్నాయి. వీటితోపాటు రూ.10 లక్షల వ్యయంతో 10 సీసీ కెమెరాలు, ఐదు ట్రాక్ (రహస్య) కెమెరాలు, 15 ఎల్ఈడీ లైట్లు, ఆహ్లాదానికి వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల ఆట వస్తువులు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

- థామస్ సుకుమార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్





వాకర్స్ వ్యాయామం, యోగాసనాలు



ఎర్రచందనం వృక్షాలు

వాకింగ్ ట్రాక్

ఉదయం, సాయంత్రం వేళల్లో రోజూ దాదాపు 200 మంది వరకు ఇక్కడ వాకింగ్ చేస్తుంటారు. ట్రాక్ పక్కనే వ్యాయామం, యోగాసనాలు వేసుకోవడానికి కూడా అటవీ అధికారులు ఏర్పాట్లు చేశారు. వీటికోసం అనుమతి తప్పనిసరి. అటవీశాఖ అధికారులు గుర్తింపు కార్డులు ఇస్తారు. అయితే వాకింగ్ ట్రాక్ మినహా అటవీ ప్రాంతంలోకి వెళ్లడానికి వీల్లేదు. బయట ప్రాంతాల వారు కూడా అనుమతి తీసుకుని నగరవనాన్ని సందర్శించవచ్చు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు

కల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బోడిరెడ్డిగారిపల్లి, పాతపేట, చల్లావారిపల్లి పంచాయతీల్లో గురువారం రాత్రి పంటలను ఏనుగులు ధ్వంసం చేయడంతో వరి, టమోటా పంటకు అపారనష్టం వాటిల్లింది. చల్లావారిపల్లిలోని రైతు శేషాద్రి నాయుడుకు చెందిన ఎకరా టమోటా, అర ఎకరా వంకాయ పంటను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. చిట్టారెడ్డిపేటలోని రైతు వెంకట్రమణకు చెందిన ఎకరా వరి, పాతపేటలోని రైతు శివమూర్తికి చెందిన అర ఎకరా వరి, శ్రీనివాసులుకు చెందిన అర ఎకరా వరి పంటను ధ్వంసం చేశాయి. ఆవులపెద్దిరెడ్డిగారిపల్లిలోని లక్ష్మీదేవికి చెందిన అర ఎకరా వరిపంట, రైతు వెంకటయ్యకు చెందిన అర ఎకరా వరిపంట, రైతు రవికి చెందిన అర ఎకరా వరిపంట, రైతు లవకుమార్‌కు చెందిన ఎకరా వరిపంటను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ఇదే గ్రామంలోని రైతు నాగరాజుకు చెందిన 10 మామిడిచెట్లను విరిచేశాయి. ఏనుగుల గుంపు దాడి చేసిన పంటలను పశ్చిమ అటవీ విభాగం ఎఫ్‌బీఓ శ్రీదేవి పరిశీలించారు. ధ్వంసమైన పంటల వివరాలు అందజేయాలని బాధిత రైతులకు సూచించారు.



చల్లావారిపల్లి వద్ద ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా పంట

అంతర్రాష్ట్ర ద్విచక్రవాహన దొంగల అరెస్టు

రూ.12లక్షల విలువైన 12 వాహనాల స్వాధీనం

శాంతిపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర ద్విచక్రవాహన దొంగలను అరెస్టు చేసినట్టు కుప్పం రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం సీఐ కథనం మేరకు... కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల విద్యార్థి విజయకుమార్ తన ద్విచక్రవాహనం శాంతిపురం అపోలో మెడికల్ షాప్ వద్ద చోరీకి గురైందని గతనెల రాళ్ళబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం రాళ్ళబూదుగూరు, గుడుపల్లె ఎస్‌ఐలు నరేష్, శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మూడు ద్విచక్ర వాహనాల్లో వెళుతూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. వాహనాల రికార్డులు లేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. కడపల్లె పంచాయతీ కదిరిఓబనపల్లెకు చెందిన నందీష్(19), బెంగళూరు నగరంలో డెలవరీ బాయ్‌గా ఉన్న ఎస్.నవీన్‌కుమార్(20), శివపురం గ్రామానికి చెందిన వి.మధు(20) బెంగుళూరు, కుప్పం, శాంతిపురం ఇతర ప్రాంతాల్లో తిరుగుతూ ద్విచక్రవాహనాల దొంగతనాలు చేసినట్టు అంగీకరించారని తెలిపారు. శాంతిపురం అపోలో మెడికల్ షాప్ వద్ద ద్విచక్రవాహనాన్ని తామే దొంగతనం చేశామని ఒప్పుకున్నారని తెలిపారు. వారిపైన కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ. 12లక్షల విలువైన హోండా డియో స్కూటీలు 7, హీరో స్ప్లెండర్ ప్లస్ మోటర్ సైకిల్ 1, హోండా ఆక్టీవా స్కూటీ 1, యమహ ఆర్ఎక్స్ 100మోటర్ సైకిల్ 1, పల్సర్ మోటర్ సైకిల్ 1, హోండా షైన్ మోటర్ సైకిల్ 1 చొప్పున 12 వాహనాలను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ద్విచక్ర వాహనాలు కేసు చేధించిన సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్ఐలు నరేష్, శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ మణికంఠన్ అభినందించారు.



దొంగలు, స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో పోలీసులు

సఫాయి కర్మచారులకు కనీస వేతనం చెల్లించాలి

కమిషన్ ఛైర్మన్ వెంకటేషన్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సఫాయి కర్మచారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస వేతనం చెల్లించాలని కమిషన్ ఛైర్మన్ ఎం.వెంకటేషన్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఒక్క రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లాకు వచ్చిన సఫాయి కర్మచారి కమిషన్ ఛైర్మన్‌కు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి స్వాగతం పలికారు. అనంతరం ఆయన చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి, అక్కడి పారిశుధ్య కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. మహిళా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మహిళా అధికారితో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ స్కీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. బ్యాంకుల ద్వారా రూ.2లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు అందించేలా లీడ్ బ్యాంకు మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఈ సందర్భంగా గత నెలలో జరిగిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఛైర్మన్‌కు కలెక్టర్ వివరించారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఛైర్మన్ వెంకటేషన్

తక్కువగా వేతనాలిస్తున్నారు

ఏళ్లతరబడి పనిచేస్తున్నా వేతనాలు తక్కువగా ఉన్నాయని చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని కార్మికులు ఛైర్మన్ దృష్టికి తెచ్చారు. జీవో నెంబరు 549 ప్రకారం రూ.16వేలకు బదులు రూ.9,500 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సమీక్షించి, న్యాయం చేస్తామని చెప్పారు. సమావేశంలో జేసీ విద్యాధరి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతిదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎల్డీఎం హరీష్, ఆర్డీవో శ్రీనివాసరావు, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ సీజ్

నలుగురిపై కేసు నమోదు

పాలసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఓ టిప్పర్‌ను ఎస్ఐ భారతి శుక్రవారం సీజ్ చేశారు. నలుగురిపై కేసు నమోదైంది. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా పాలసముద్రం మండలంలోని సింహరాజుపురం గ్రామం సమీపంలోని తమిళనాడు బోర్డర్‌లో నిల్వ ఉంచారు. శుక్రవారం వేకువ జామున తమిళనాడులోని రాజుకు చెందిన టిప్పర్‌లో ఇసుకను నింపారు. ఆ తర్వాత తమిళనాడుకు తరలిస్తుండగా సింహరాజుపురం గ్రామానికి సమీపంలోని మట్టి రోడ్డులో టిప్పర్ కూరుకు పోయింది. గమనించిన గ్రామస్తులు ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తుండిన రాజుతోపాటు సింహరాజపురానికి చెందిన శరవణ, ముని, యల్లప్పను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



66 పంచాయతీల్లో పల్లెపండుగ

● రూ.8.42 కోట్లతో 171 పనులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 66 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం పల్లెపండుగ నిర్వహించారు. రూ.8.42 కోట్లతో 171 పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో జరిగిన పల్లెపండుగ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. తొలి రోజు నుంచి ఇప్పటి వరకు రూ.34.54 కోట్లతో 669 పనులు చేపట్టారు.

టెట్‌కు 298 మంది హాజరు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు శుక్రవారం 298 మంది హాజరయ్యారు. జిల్లాలోని రెండు, చెన్నైలోని ఒక సెంటర్‌లో ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో జరిగిన పరీక్షలకు 378 మంది అభ్యర్థులకుగాను 298 మంది హాజరవగా, 80 మంది గైర్హాజరైయారు. ఉదయం సెషన్‌లో 74 మందికిగాను 25 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 304 మందికిగాను 55 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

హోటళ్లలో విజిలెన్స్ తనిఖీలు

నగరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలో డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తున్న దుకాణాలపై తిరుపతి ప్రాంతీయ నిఘా అధికారి ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాలతో శుక్రవారం దాడులు నిర్వహించారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరవి, చంద్రశేఖర్, స్థానిక రెవెన్యూ అధికారులు డీటీ మేఘవర్ణం, వీఆర్‌వో కేశవులు బృందంగా వెళ్లి తిరుత్తణి రోడ్డులో ఉన్న హనీఫా హోటల్, సుదర్శన్ స్వీట్స్, జబ్బర్‌హోటల్, ఆర్‌ఆర్‌హోటల్, మాషా అల్లా బిర్యానిసెంటర్, విరాట్ టీస్టాల్‌లో దాడులు చేశారు. వారు అక్రమంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి.. యజమానులపై కేసులు నమోదు చేశారు.

నేడు సీఆర్టీ, పీజీటీలకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష (ఎస్ఎస్)లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ల (సీఆర్టీ, పీజీటీ) పోస్టుల అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన శనివారం జరుగుతుందని ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక డీఈవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో 1:3 రేషియోలో పరిశీలన ఉంటుందన్నారు. సీఆర్టీ ఇంగ్లీష్ పోస్టులు 2, ఫిజిక్స్ ఒకటి, పార్టుటైం టీచర్స్ 5, పీజీటీ సివిక్స్ ఒకటి, కామర్స్ ఒకటి, వార్డెన్స్ 2, అకౌంటెంట్ ఓ పోస్టుకుగాను అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు.

ఏటీఎంలో చోరీ యత్నం

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి-ఎస్వీయూ ప్రధాన రహదారి పక్కన ఆంజనేయస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న హిటాచ్చి ఏటీఎంను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యారు.

వరిపై అడవి పందుల దాడులు



నాగమవాండ్లపల్లెలో ధ్వంసమైన వరి

ఐరాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలోని నాగమవాండ్లపల్లెలో వరి పంటపై అడవి పందులు దాడి చేసి, ధ్వంసం చేశాయి. అటవీప్రాంతానికి సమీపంలో పంట పొలాలు ఉండటంతో రోజూ రాత్రిపూట శబ్దాలు చేస్తూ అడవి జంతువులు వైపు రాకుండా చూసుకునేవారు. ఈ క్రమంలో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో రైతులు ఇళ్లకు వచ్చేశారు. దీంతో అడవి పందుల గుంపు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి అనే రైతు పొలంలో రెండెకరాలలో వరి పంటను నాశనం చేశాయి. గత ప్రభుత్వంలో ఏనుగుల బెడద ఎక్కువగా ఉండటంతో అటవీ ప్రాంతాలను ఆనుకుని ఉన్న గ్రామాల వద్ద ట్రెంచ్ కొడతామని హామీ ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం అడవి జంతువుల వల్ల పంటలు కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పశువుల్లో నట్టల నివారణ చేపట్టాలి



గొర్రెలకు మందు తాగిస్తున్న జేడీ ప్రభాకర్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ చేపట్టినప్పుడే అవి ఆరోగ్యంగా ఉంటాయని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం తవణంపల్లె మండలంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో ఏడు లక్షల గొర్రెలు, మేకలు ఉంటాయన్నారు. వాటి ఆరోగ్య స్థితి ఆధారంగా ఒక్కో పశువుకు ఐదు ఎంఎల్ నుంచి 10 ఎంఎల్ వరకు నట్టల నివారణ మందు తాగిస్తే వాటికి మరింత ఆరోగ్యం ఉంటుందన్నారు. నెలాఖరు వరకు ఈ కార్యక్రమం సాగుతుందని చెప్పారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

రొంపిచెర్ల, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పంచాయతీ వారణాశివారిపల్లెకు చెందిన నిందితుడు ప్రవీణ్‌కుమార్‌ను శుక్రవారం అరెస్టు చేసి పీలేరు కోర్టుకు పంపినట్లు కల్లూరు రూరల్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఈనెల 15న వారణాశివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య రోజాపై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి నిందితుడు ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేశామన్నారు.

నాటు తుపాకుల స్వాధీనం

ఆరుగురి అరెస్టు

యాదమరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరు నాటు తుపాకులను స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అరెస్టు చేశారు. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండల పరిధిలోని కీనాటంపల్లె పంచాయతీ షికారీ కాలనికి చెందిన వసంతరాజ్, చందు, సురేష్, అజిత్, రమేష్, సికిందర్‌లు నాటు తుపాకులు కలిగి ఉన్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో శుక్రవారం తెల్లవారు జామున దాడులు చేసి తుపాకులు స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



నాటు తుపాకులతో నిందితులు

అర్హులందరికీ పథకాలు అందజేయండి



ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం

పెద్దపంజాణి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డెప్ప సూచించారు. శుక్రవారం పెద్దపంజాణి మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాలాజి మాట్లాడుతూ అధికారులు, పాలకులు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ఆదర్శవంతంగా అమలు చేద్దామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ కార్డులులేని గిరిజనులకోసం స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు బాగా లేదని విద్యాశాఖ అధికారులను వీరప్పల్లె ఎమ్పీటీసీ సుబ్రమణ్యం నిలదీశారు. ఇద్దరు ఎంఈఓలు ఉన్నా విద్యాప్రమాణాలు మెరుగు పడలేదన్నారు. మధ్యాహ్న భోజనం సైతం నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని తెలిపారు. మండలంలోని నిడిగుంట, శంకర్రాయలపేటకు ఆర్టీసీ బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎమ్పీటీసీలు పాల్గొన్నారు.

పేదరికంలేని సమాజమే ధ్యేయం



సోడిగానిపల్లెలో మాట్లాడుతున్న పీఎస్‌మునిరత్నం

గుడుపల్లె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం తెలిపారు. శుక్రవారం గుడుపల్లె మండలం సోడిగానిపల్లెలో గోకులం షెడ్ల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుప్పం నియోజకవర్గంలో పాడిరైతులకు విరివిగా గోకులం షెడ్లను మంజూరు చేశారన్నారు. ఐదేళ్లలో ప్రతి పాడిరైతుకు గోకులం షెడ్లను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బాబునాయుడు, యూనిట్ ఇన్‌చార్జి హేమాంబరగౌడు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు సీఎస్‌ను కలిసిన ద్రవిడ వర్సిటీ వీసీ



గుడుపల్లె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర ముఖ్యకార్యదర్శి మురుగానందంను శుక్రవారం ద్రావిడ వర్సిటీ వీసీ ఆచార్య దొరస్వామి, ఏపీ మాజీ ముఖ్యకార్యదర్శి చల్లప్పలు కలిశారు. వర్సిటీలోని తమిళ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలు, విద్యార్థుల ఉపకార వేతనాలకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం ఏటా బడ్జెట్ ఇవ్వడం జరుగుతుందని వీసీ ఈ సందర్భంగా ముఖ్యకార్యదర్శికి తెలిపారు. గత నాలుగేళ్ళుగా నిధులు వర్సిటీకి అందడంలేదన్న విషయాన్ని ముఖ్యకార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళారు. నిధులు సత్వరం విడుదలయ్యేలా చూడాలని కోరగా, ముఖ్యకార్యదర్శి సానుకూలంగా స్పందించారని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ తమిళ శాఖాధిపతి ఆచార్య విష్ణుకుమార్, ప్రజాసంబంధాల అధికారి గణేష్‌మూర్తి పాల్గొన్నారు.

మునగాకులో మంచి పోషక విలువలు



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

పలమనేరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : ఆహారంలో అత్యంత ఆరోగ్యకరమైనది మునగాకు అని, అందులో మంచి పోషకవిలువలు ఉంటాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నజ్మా పేర్కొన్నారు. శుక్రవారం కొలమాసనపల్లి పంచాయితీ గొల్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మోరింగ ఫెస్టివల్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మునగాకు ఆహారంలో తీసుకోవడం వలన ఐరన్, ప్రోటీన్లు, విటమిన్లు, క్యాల్షియం తదితర పోషకవిలువలు శరీరానికి అందుతాయన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మునగ మొక్కను నాటారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సరస్వతి, మంజుల, పార్వతి, జోతీశ్వరి, నాగమణి, బిడ్డల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీఓ విచారణ

రామకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బందార్లపల్లె పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై శుక్రవారం గ్రామసచివాలయంలో కుప్పం డీఎల్‌పీఓ రాధాకృష్ణ విచారణ జరిపారు. గ్రామాల్లో ఎటువంటి పనులు చేపట్టకనే, తప్పుడు రికార్డులు సృష్టించి నిధులు స్వాహా పర్వం జరిగిందని పలువురు ఇటీవల కలెక్టరు, ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం డీఎల్‌పీఓ రాధాకృష్ణ గ్రామసచివాలయంలో సర్పంచు రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథరెడ్డిలను ప్రజల సమక్షంలో విచారించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ సోమవారం మరోసారి రికార్డులను తనిఖీ చేసి, ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

పుంగనూరు అభివృద్ధికి సహకరించాలి

మంత్రులకు చల్లా బాబు వినతి

పుంగనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మంత్రులకు వినతి చేసినట్లు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ ప్రధానకార్యాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన శాసనసభాపక్ష సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, టీడీపీ ఇన్‌చార్జిలకు పార్టీ పటిష్టత, ప్రభుత్వ కార్యక్రమాలపై పలు సూచనలిచ్చారన్నారు. అలాగే నియోజకవర్గ సమస్యలు తీర్చడానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

రేపు ఉచిత కంటి పరీక్ష శిబిరం

కుప్పం : సాయిమాతా సేవాట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే ఆదివారం కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. కుప్పం బాలుర ఉన్నత పాఠశాలలో శిబిరం ఉంటుందని తెలిపారు.

అడుగడుగునా గుంత



సోమల - నంజంపేట రహదారిలో పలు చోట్ల గుంతలు

సోమల, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): సోమల మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. అడుగుకో గుంత తో ప్రయాణం చేయాలంటే ప్రజలు హడలిపోతున్నారు. సోమల నుంచి పెద్దఉప్పరపల్లెకు, నంజంపేట, చిన్నఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీలకు ఈమార్గంలో ప్రయాణం ఇబ్బందిగా మారింది. నిత్యం ఈ మార్గంలో ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు నానావస్థలు పడుతున్నారు. గతేడాది రోడ్లు దెబ్బతిన్న చోట్ల ప్యాచ్‌లు వేసేందుకు పనులు మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇటీవల రోడ్ల దుస్థితిపై కూటమి నాయకులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్యాచ్ పనులకు రూ. 9లక్షలతో ప్రతిపాదనలు పంపారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ మార్గం రోడ్ల పనులకు మోక్షం కలగడంలేదని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలోని సరస్వతీపురం వద్ద జీడిరేవుల వంకపై కల్వర్టు నిర్మాణం చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు.

గతుకుల రోడ్డులో ప్రయాణం నరకం



నంజంపేట రోడ్డుపైకి వస్తే దుమ్ము ధూళి, గతుకుల ప్రయాణం భారంగా ఉంది. నిత్యం ఈమార్గంలో ప్రయాణం చేస్తున్నాం. గతుకుల రోడ్డుతో వాహనాలు దెబ్బతింటున్నాయి. చినుకుపడితే ఈరోడ్డు ప్రయాణం నరకమే.
- నవీన్, సచివాలయ ఉద్యోగి, సోమల

ముళ్లపొదలతో ప్రమాదాలు



సోమల నుంచి నంజంపేట మీదుగా నాయనపాకాల వెళ్లే మార్గంలో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు ఇరువైపులా మొక్కలు తొలగించకపోవడంతో మలుపుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలి. -నాగభూషణం, జనసేన మండల అధ్యక్షుడు

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి



పలమనేరు మండలం మొరం గ్రామం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం , మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పలమనేరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగులో రసాయినిక ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వలన తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు వేపనూనె లేదా బాసిలస్ తురంజియసిస్ లేదా ఇసుక, బూడిద కలుపుకొని సుడిలో వేసి నివారించుకోవాలన్నారు. ఇక వరిపంట కోత సమయంలో వర్షపునీరు ఎప్పటికప్పుడు బయటకు పంపే ప్రయత్నం చేయాలని సూచించారు. వరిగింజ రంగుమారకుండా ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేయాలన్నారు. రైతులకు సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి జె. మురళీకృష్ణ, ఏడీ అన్నపూర్ణాదేవి, జిల్లా వనరుల కేంద్రం ఏడీ విజయ్‌శంకర రెడ్డి, ఏవో సంధ్య, సెరికల్చర్ అధికారులు, రైతు నాయకులు రామచంద్రనాయుడు, రైతులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో అధిక ఆదాయం

పెద్దపంజాణి : మల్బరీ సాగుతో అధిక ఆదాయం సాధించవచ్చునని పట్టుపరిశ్రమ శాఖ ఏఎస్‌ఓ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం రాజుపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో అధికారులు అనిల్‌కుమార్, బాలాజి, రెహమాన్, శ్రీనివాసులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కల్లూరు : రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవో శ్రీనివాస్ తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి, 106 రామిరెడ్డిగారిపల్లెల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ కలుపు వలన 20శాతం దిగుబడి తగ్గిపోతోందని, కలుపు మందులు తగు మోతాదులో వాడాలన్నారు. దుక్కులు లోతుగా దున్నుకోవాలని తెలిపారు.

శాంతిపురం : రాళ్ళబూదుగూరు పంచాయతీ శెట్టిగానికురుబూరు, కెనమాకులపల్లె గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో అప్పోజీ రైతులతో సమావేశం నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం రాగి, వరి, అరటి, చామంతి, బంతిపూలు పంటలను పరిశీలించారు.

అంగన్వాడీలను తనిఖీ చేసిన కడా పీడీ



అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో కడా పీడీ వికాస్ మర్మత్

శాంతిపురం, అక్టోబరు 18 (ఆధ్రజ్యోతి) : శాంతిపురం మండలంలో కడా పీడీ వికాస్‌మర్మత్ పర్యటించారు. శుక్రవారం బడుగుమాకులపల్లె, పోడూరు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. తరువాత బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరువాత తొలిసినాయపల్లె ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వార్డెన్ విద్యార్థులతో పనులు చేయిస్తోందని విద్యార్థులు తెలిపారు. దీనిపైన ఆయన స్పందించి త్వరలోనే తాగినీటి సమస్య తీరుస్తామని, వార్డెన్‌పై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, నాయకులు నాగరాజు, రమేష్, ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, సీడీపీవో కల్పన, అంగన్వాడీ సూపర్ వైజరు సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలతోనే ఆరోగ్యం

పుంగనూరు రూరల్ : గర్భిణీలు, బాలింతలు, మహిళలకు ఆకుకూరలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని పుంగనూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అయేషానజ్రీత్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఉర్దూ పాఠశాల వీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె ఆకుకూరలపై అవగాహన కల్పించారు. మునగాకు ప్రాముఖ్యత, ప్రొటీన్లు, ఆకు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి,అంగన్‌వాడీ కార్యకర్త ప్రేమలత పాల్గొన్నారు.

వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

చౌడేపల్లె, అక్టోబర్18: విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక భవిత విద్యార్థులతో కలసి నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులకు అభ్యసనలో వైకల్యంను గుర్తించి ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలమ్మ, భవిత సెంటర్ ఉపాధ్యాయులు రామమోహన్, నరేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : చదువులో వెనుకబడిన ఐదు రకాలైన అభ్యాస వైకల్యం గల విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ కల్పించి సరిదిద్దవచ్చునని పుంగనూరు ఎంఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టిలు తెలిపారు. శుక్రవారం స్థానిక భవిత సెంటర్ విద్యార్థులకు సంబంధించి నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన కల్పించడానికి కొత్తఇండ్లు ఉన్నత పాఠశాల నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సుబ్రహ్మణ్యం,స్పెషల్ ఎడ్యుకేషన్ టీచరు సి.రాధిక, ఐఈఆర్‌పీలు వెంకటరమణ, అరుణమ్మ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు భూమి పూజ

శాంతిపురం: రాళ్ళబూదుగూరులో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం భూమి పూజ చేశారు. అనంతరం నడింపల్లె, చిన్నారిదొడ్డి, సి.బండపల్లె, 64పెద్దూరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పివి నాగరాజు, చలపతి, నామాలప్ప, ఆర్‌ఎస్ మణి, నారాయణస్వామి, ప్రకాష్, ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, ఏపీవో హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన కల్వర్టుల పరిశీలన

సోమల : సోమల మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు తెగిన కల్వర్టులను అధికారులతో కలసి టీడీపీ నాయకులు పరిశీలించారు. పెద్దఉప్పరపల్లె నుంచి పేటూరు, బసవపల్లె, బోనమంద, రెడ్డివారిపల్లె, దుర్గంకొండ, చిన్నకమ్మపల్లె గ్రామాల కు రాకపోకలు పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నిరాజ్, ఎంపీడీవో నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, మాజీ సర్పంచులు వేణుగోపాల్ నాయుడు, బాలాజీ నాయుడు, రెడ్డెప్పనాయుడు, లక్ష్మీపతినాయుడు, వినోద్‌కుమార్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

వి.కోట : మండల పరిధిలోని బోయచిన్నాగపల్లె, చింతమాకులపల్లె, ఎస్.బండపల్లె పంచాయతీల్లో రోడ్డునిర్మాణ పనులకు శుక్రవారం టీడీపీ నేతలు భూమిపూజ చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, పీఆర్‌ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ మహేష్, ఎంపీడీవో ఈశ్వరన్, ఏపీవో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నంజంపేటలో పేలిపోయిన టీవీలు

సోమల : సోమల మండలంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులకు నంజంపేట, పొదలకుంటపల్లె, దాదేం వారిపల్లె, దళితవాడలో పలు టీవీలు, ఫ్రిజ్‌లు, విద్యుత్ దీపాలు పేలిపోయినట్లు పలువురు బాధితులు తెలిపారు. శుక్రవారం ఉదయం టీవీలు కాలిపోయి పనిచేయలేదని తెలిపారు.

బైరెడ్డిపల్లె సచివాలయం తనిఖీ

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెలో వున్న గ్రామసచివాలయాన్ని శుక్రవారం జడ్పీచైర్మన్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించి ప్రజలకు సేవచేయాలని సిబ్బందికి సూచించారు. జడ్పీటీసీ కేశవులు, సర్పంచ్ వెంకటేష్, ఈవోఆర్డీ తిరుమలగోపాల ప్రసాద్, గ్రామకార్యదర్శి సదాశివయ్య, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

పుంగనూరు : టపాకాయలు విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు చెప్పారు. శుక్రవారం అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల మండలాల టపాకాయలవిక్రేతలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు 23 దరఖాస్తులు రాగా శనివారం పరిశీలన చేసి, ఎలాంటి పోలీసు కేసులు లేనివారికి లైసెన్స్‌లకు మంజూరు చేస్తామన్నారు. అనుమతి లేకుండా నిల్వచేస్తే చర్యలు తప్పవన్నారు.

బైరెడ్డిపల్లె ఎస్‌ఐగా పరశురాముడు

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె నూతన ఎస్‌ఐగా పరశురాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ కృష్ణయ్య గత రెండు నెలల క్రితం బదిలీ కావడంతో అప్పటి నుంచి ఇక్కడ ఎస్‌ఐ పోస్టు ఖాళీగా వుంది. దీంతో అనంతపురం జిల్లానుంచి బైరెడ్డిపల్లెకు నూతన ఎస్‌ఐగా పరశురాముడును నియమించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన శాయశక్తులా కృషి చేస్తానని ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కుప్పంలోని 132/33 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు గుడుపల్లె, కుప్పం మండలాలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని రెస్కో ఎండీ సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పలమనేరులో...

పలమనేరు,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చిన్నబ్బ తెలిపారు. పలమనేరు సబ్‌డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్ల నిర్వహణ, మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

లింగ నిర్ధారణ చేస్తే శిక్ష

పలమనేరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేయడం నేరమని, అలా ఎవరైనా లింగనిర్ధారణ చేస్తే జరిమానా, జైలు శిక్ష తప్పదని జిల్లా అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో వెంకటప్రసాద్ హెచ్చరించారు. పలమనేరులో శుక్రవారం పీసీపీఎన్‌డీటి యాక్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ కారణంగా భ్రూణ హత్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మల్లికార్జునరెడ్డి, ఆర్‌ఎంఓ శారద, వలంటీర్లు ప్రమీల, వెంకటరమణ, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ

పలమనేరు,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):పలమనేరు మండలం ముసలిమడుగు వద్ద ఉన్న మారెమ్మ ఆలయంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. మారెమ్మగుడి తలుపులు తీసి, హుండీని పగులగొట్టి అందులోని నగదు తీసుకొని వెళ్లిపోయారు. ముసలిమడుగుకు చెందిన కృష్ణమూర్తినాయుడు తన పొలం వద్ద ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి సమీపంలో షెడ్డులో ఉన్న రెండు పాడి ఆవులను కూడా దొంగలు దొంగిలించుకొని పోయారు.

గోకులం షెడ్ పనుల ప్రారంభం



రామకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల గ్రామంలో శుక్రవారం గోకులం షెడ్ నిర్మాణపు పనులను టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి ప్రారంభించారు. కుప్పం ప్రాంతంలోని ప్రతి పాడిరైతుకు గోకులం షెడ్లు మంజూరవుతాయని, ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు రామ్మూర్తి, నాగభూషణం, ఎర్రప్ప, మునిరత్నం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల పరిశీలన



కుప్పం, అక్టోబరు 18: కుప్పం మండలంలోని నూలుకుంట, గరిగచీనేపల్లె, మల్లానూరు గ్రామాలలో సిబ్బందితో కలిసి కడా పీడీ వికాస్ మర్మత్ పర్యటించారు. ఇప్పటికే నిర్మాణమైన గోకులం షెడ్లను పరిశీలించారు. ఇంకా నిర్మాణం మొదలు కాని పనుల గురించి, స్థానిక ప్రజా సమస్యలపై గ్రామీణులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఎన్‌ఆర్‌జీఎస్ పీడీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, పశువైద్యాధికారితోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

చౌడేపల్లె, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): రైతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రైతు సేవా కేంద్రంలో రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో జ్యోతి, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, అక్టోబర్18 (ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొన్నారు.

పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచాలి

రొంపిచెర్ల,అక్టోబరు18: (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచాల్సివుందని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. రొంపిచెర్ల వీధుల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 2వ తరగతి నుంచి 7వరకు చదివే పిల్లలలో విద్యా పరంగా వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తారని, దీని కోసం ప్రభుత్వం ముగ్గురు ఉపాధ్యాయులను నియమించిందన్నారు. చిత్రలేఖనం, మోడల్స్ ద్వారా బోధనలు ఇస్తారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఈ ర్యాలీలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవమ్మ, రవికుమార్, భవిత ఉపాధ్యాయులు అమ్ములు, మానస, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

రామకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కెంచనబల్ల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణీలు, బాలింతలకు టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహకకార్యదర్శి పత్రనారాయణాచారిలు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్రామగౌడు, టీడీపీ సీనియర్ నేతలు రామ్మూర్తి, సత్తి, చంద్రశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, నాగరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్‌లో ట్రాన్స్‌కో రూరల్ డివిజన్ కార్యాలయం

● ఏర్పాటుకు సన్నాహాలు


పాత కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

చితూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాత కలెక్టరేట్‌లో ట్రాన్స్‌కో రూరల్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పాత కలెక్టరేట్‌ను ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం పరిశీలించారు. గదుల్లో పైకప్పు పెచ్చులూడటం, గోడలకు చెమ్మ చేరకుండా మరమ్మతులు, పెయింటింగ్, వైరింగ్ వంటి పనులు అవసరమని తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్‌ఈలు సురేంద్ర నాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ సూచించారు. సివిల్ విభాగం అధికారులు ఈ పనులకు రూ.5 లక్షల వరకు అవసరమవుతాయని అంచనా వేశారు. ఈఈలు మునిచంద్ర, సురేష్, అమర్ బాబు, డీఈలు శేషాద్రి, ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పండుగ : టీడీపీ

నగరి/వెదురుకుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పండుగ వాతావరణాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందని టీడీపీ నేతలు అన్నారు. నగరి మండలం బీరకుప్పం పంచాయతీలోని కావేటిపురంలో రూ.8లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్డుకు శుక్రవారం టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి భూమి పూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఉపాధి సిబ్బందితోపాటు టీడీపీ నాయకులు మునికృష్ణ, మండల మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్వరి, నాగరాజకుప్పం మాజీ సర్పంచి సెల్వమణి, మురుగేష్, ధనపాల్, సతీష్, కళ్యాణ్, గోవర్దన్, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు. ● వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెలో సర్పంచ్ బండి శశి ఆనందరెడ్డి ఆధ్వర్యంలో సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేశారు. తెలుగుదేశం పార్టీ బూత్ కమిటీ కన్వీనర్ బోడిరెడ్డి రామకృష్ణారెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు చంగల్ పండురెడ్డి, టీడీపీ నేతలు నాగిరెడ్డి, వెంకటాద్రినాయుడు, గుణశేఖర్ పాల్గొన్నారు. రెడ్డేపల్లెలోనూ ఎస్సీ సెల్ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బీఎం రవి ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీఆర్‌పురంలో సిమెంటు రోడ్డు పనులు టీడీపీ నేత మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ● కార్వేటినగరం మండలం ఎంఎం విలాసంలో తెలుగు రైతు విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాదిరాజు జనార్దనరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు చెంగ్రాయయాదవ్ ఆధ్వర్యంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని చేపట్టారు.

దళిత ఉద్యోగులకు అండగా ఉంటాం

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు


సమావేశంలో పాల్గొన్న దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యోగులకు జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ అండగా ఉంటుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో కేరళ రాష్ట్రంలోని మున్నార్, కొచ్చి వేదికగా దళిత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు జాతీయ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కమిటీ సభ్యుడి హోదాలో శుక్రవారం ఎంపీ ప్రసంగించారు. అనంతరం ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు.

వరద బాధితుల కోసం రూ.3.30లక్షల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న నాగేశ్వరరావు, లావణ్య దంపతులు

గంగాధరనెల్లూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరదబాధితుల సహాయార్థం శ్రీభానోదయ విద్యాసంస్థల తరఫున రూ.3.30లక్షలను విరాళమిచ్చారు. అమరావతిలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గంగాధరనెల్లూరు మండలం కోటాగరం పంచాయతీ ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్‌మీడియం, సీబీఎస్‌ఈ విద్యాసంస్థల చైర్మన్ మద్దిపట్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య రెండ్రోజుల కిందట కలిశారు. రూ.3.30 లక్షల చెక్‌ను లావణ్య, నాగేశ్వరరావు దంపతులు, వారికుమారుడు ధీరజ్‌తో కలిసి సీఎంకు అందజేశారు.

రీసర్వేలో తప్పులు సరిదిద్దడానికే గ్రామసభలు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వేలో తప్పులు సరిదిద్దడానికే ఈనెల 22 నుంచి వచ్చేనెల 27వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈనెల 22న ఎల్లాపల్లె, 23న అంబోధరపల్లె, 24న అగరమంగళం, 25న పాతపాళ్యం, 26న కొత్తవెంకటాపురం, 29న కొండేపల్లె, 30న ఎర్రబోడిరెడ్డిపల్లెలో సభలు ఉంటాయన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోండి

వెదురుకుప్పం/ గంగాధరనెల్లూరు/ ఐరాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని కార్వేటినగరం ఐసీడీఎస్ సీడీపీవో పద్మ సునంద తెలిపారు. శుక్రవారం వెదురుకుప్పంలో 'సామాజిక వేడుక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునగ ఆకులోని పోషక విలువలను తెలిపారు. సూపర్‌వైజర్ భారతి, ఏఎన్ఎం ఎర్రసానమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు జయసుధ, విజయకుమారి, అరుణ, చిరంజీవులు పాల్గొన్నారు.● కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవోతోపాటు సూపర్‌వైజర్లు ఎస్.శ్యామిని, ఇ.ఇందిర, ఎం.భారతి హాజరయ్యారు. ● గంగాధరనెల్లూరు మండలంలోని వేపంజేరి పంచాయతీ ముసలయ్యగారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో గుండ్లపల్లె, సూపర్‌వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ, సంగీత, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. ● ఐరాల మండలంలోని తాళంబేడువారిపల్లె, పేరయ్యగారిపల్లె, చంద్రయ్యగారిపల్లెలో జరిగిన కార్యక్రమాల్లో ఐరాల సెక్టార్ సూపర్‌వైజర్ మంజుల, ఆశావర్కర్లు వేణమ్మ, రాధమ్మ, గౌరి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మాదిరెడ్డిపల్లె పీహెచ్‌సీలో తనిఖీలు


పీహెచ్‌సీలో రామ్మోహన్, జార్జి తదితరులు

యాదమరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదిరెడ్డిపల్లె పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీ చేశారు. అనంతరం 184 గొల్లపల్లె, పత్రపల్లె సబ్‌సెంటర్లను తనిఖీ చేసి మాతాశిశు మరణాల నివారణకు చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. డీపీఎంవో రామ్మోహన్, డీఎస్వో జార్జి, మెడికల్ ఆఫీసర్ శివకుమార్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈవో మునీంద్ర రాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలన


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

పాలసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మణికంఠ శుక్రవారం తనిఖీ చేశారు. కొంత కాలంగా తమిళనాడుకు ఇసుక అక్రమంగా తరలుతుండటంతో ఆ వాహనాలు పట్టుబడుతుండటంతో వివరాలు ఆరా తీశారు. అలాగే రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కేసుల పురోగతిపై సమీక్షించారు. ఏఎస్ఐ లక్ష్మి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

లాటరీ విక్రేత అరెస్టు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లాటరీ టికెట్లు అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల గంజాయి, సారా, లాటరీ టికెట్లపై నిఘా ఉంచారు. మున్సిపల్ కాలనీకి చెందిన ఉమామహేష్.. సామిరెడ్డివీధిలో చిన్న దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇందులో కేరళకు చెందిన లాటరీ టికెట్లను స్లిప్‌ల రూపంలో రాసిస్తున్నాడని సమాచారం అందింది. దాంతో టికెట్లు అమ్ముతున్న ఉమామహేష్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.18,370లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పొట్టేళ్లు, మేకల చోరీపై ఫిర్యాదు

బంగారుపాళ్యం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మిట్టపల్లె గ్రామంలో మేకపోతులు, పొట్టేళ్లను చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. మిట్టపల్లెకు చెందిన నాగరాజు.. మేకలు, గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి తన దొడ్డిలోని ఐదు పొట్టేళ్లు, నాలుగు మేకపోతులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాటి విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని తెలిపారు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ మునిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు రూరల్ మండలం దొడ్డిపల్లె, గుడిపాల మండలంలో పానాటూరు, పాపసముద్రం, 197 రామాపురం, పూతలపట్టు మండలం, పాలసముద్రం, కార్వేటినగరం మండలాల్లో పూర్తిగా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

22న జాబ్ మేళా

వెదురుకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఐటీఐ ఆవరణంలో ఈనెల 22వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ పి.గణేష్ శుక్రవారం తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

అధ్వానంగా పారిశుధ్యం

మాపాక్షి కాలనీలో కనపడని అభివృద్ధి ● ఆవేదనలో స్థానికులు


మురుగులో తాగునీటి పైపులైను


పాచిపట్టిన నీళ్ల ట్యాంకు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 18 (అక్టోబరు): నగరపాలక సంస్థ పరిధిలోని 13వ డివిజన్‌లో మాపాక్షి కాలనీ ఉంది. ఈ కాలనీలో పారిశుధ్యం, మౌలిక వసతులను అటుంచితే తమ వార్డు పరిధిలో జరిగిన అభివృద్ధిని దీపం పెట్టి వెతికినా కనపడదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని పన్నులను చెల్లిస్తున్నా.. అభివృద్ధి చేయడంలో అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు.

ఈ కాలనీ ప్రజలు వ్యవసాయం, కూలీ పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ గతంలో ఎప్పుడో కట్టిన చిన్నపాటి కాలువలు పూడిపోవడంతో నీరంతా వీధుల్లోనే ప్రవహిస్తుంది. దీని వల్ల దోమల బెడద అధికంగా ఉంది. ఎప్పుడో నిర్మించిన నీళ్లట్యాంకు మరమ్మతుకు గురై.. శిథిలావస్థకు చేరుకుంది. ఈట్యాంకు నుంచే వచ్చే నీటినే ప్రజలు పట్టుకుంటున్నారు. ట్యాంకు ద్వారా వచ్చే పైపులైన్‌లు లీకేజీ కావడం.. పాచిపట్టిపోవడంతో వర్షాకాలంలో ఆ నీళ్లను తాగలేక పోతున్నారు. మురుగంతా కొళాయి నీళ్లలో కలిసి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పకైనా నగరపాలక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అభ్యసన వైకల్యంపై అవగాహన ర్యాలీ


చిత్తూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్/గంగాధరనెల్లూరు/ నగరి/ వెదురుకుప్పం/ యాదమరి/ నింద్ర/ గుడిపాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డిస్లెక్సియా (అభ్యసన వైకల్యం) వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగులైన చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించారు. డీఈవో దేవరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, సహిత విద్య ఇన్‌చార్జి నరోత్తంరెడ్డి, ఎంఈవో 1,2 సెల్వరాజ్, మోహన్, భవిత సెంటర్ టీచర్లు పాల్గొన్నారు.

● గంగాధర నెల్లూరు హైస్కూల్ నుంచి బస్టాప్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు అంజినేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎంలు హేమలత, రెడ్డెమ్మ, టీచర్లు పాల్గొన్నారు. ● నగరి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ర్యాలీలో హెచ్‌ఎం పార్వతీదేవి, ప్రత్యేక బోధకులు, సీఆర్పీలు పాల్గొన్నారు. ● కార్వేటినగరంలో జరిగిన ర్యాలీలో ఎంఈవో డీపీ మనోజ్ కుమార్, హెచ్‌ఎం జి.కోటీశ్వరరావు, టీచర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు. ● వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం భవిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎంఈవో దామోదరం, హెచ్‌ఎం సిద్ధయ్య, టీచర్లు పాల్గొన్నారు. ● యాదమరి మండలంలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఎంఈవో ప్రసాద్, హెచ్‌ఎం గిరిరాజ, టీచర్లు పాల్గొన్నారు. ● నింద్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ర్యాలీలో ఎంఈవోలు వసమతిదేవి, శ్రీధర్‌రాజు, హెచ్‌ఎం శివయ్య, టీచర్లు పాల్గొన్నారు. ● గుడిపాలలో జరిగిన ర్యాలీలో ఎంఈవో-2 గణపతి, నరహరిపేట జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఖాతుంబీ, టీచర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం పుస్తక రచయిత డాక్టర్ షమ్సి అక్తర్ రచించిన 'ప్రేమ్ చంద్రోత్తర్ కహాని సాహిత్యమే సాంప్రదాయకత : కారణ్ ఔర్ పరిణామ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డార్మెటరీకి చాపల వితరణ



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డార్మెటరీకి ముళ్‌బాగల్‌కు చెందిన రఘురామయ్య, రమేష్‌బాబు 150 చాపలను శుక్రవారం వితరణ చేశారు. వీరికి ఈవో గురుప్రసాద్, మాజీ చైర్మన్ మణినాయుడు.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఈ గుంతలు పూడ్చేదెప్పుడు..?



గుడిపాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలో ఎంసీఆర్ క్రాస్, పానాటూరు, అనుపు వద్ద రోడ్డులో లోతైన గుంతలు ఏర్పడడంతో ఇటు వాహన చోదకులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా పల్లం, మిట్ట తెలియక పడిలేచి గాయాలపాలవుతున్నారు. గతంలో పానాటూరు గ్రామ సమీపంలో ఇదే గుంత వద్ద ప్రమాదాలు జరిగి ఇద్దరు, ముగ్గురు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి.

ఎల్లసముద్రం రోడ్డుకు మోక్షం లేదా?


కంకర పరచిన ఎల్లసముద్రం రోడ్డు

విజయపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుత్తణి రోడ్డునుంచి ఎల్లసముద్రం వరకు ఉన్న రోడ్డుకు మోక్షం లేదా అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకు ఆర్థిక సహకారంతో రూ.40 లక్షల నిధులతో 0.62 కిలోమీటరు రోడ్డును రెండున్నర సంవత్సరాల క్రితం ప్రారంభించి కంకర కూడా పరిచారు. కానీ సంవత్సరాలు తరబడినా రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తి కాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈరోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2లక్షల విరాళం


చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న కళాధర్ రావు

బంగారుపాళ్యం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు కళాగ్రాండ్ హోటల్ అధినేత కళాధర్‌రావు రూ.2లక్షల చెక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజయవాడలో అందజేశారు. అలాగే పార్టీ బలోపేతానికి మరో రూ.లక్షను కూడా అందజేసినట్లు శుక్రవారం తెలిపారు.

క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయెద్దు


సిబ్బందితో మాట్లాడుతున్న వెంకట ప్రసాద్

బంగారుపాళ్యం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయెద్దని అడిషినల్ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్ అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రిలోని క్షయ లేబోరేటరీని తనిఖీ చేశారు. జిల్లా కో-ఆర్డినేటర్ సంతోష్, సూపర్‌వైజర్‌శివకుమార్, ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదమరి, సీటీఎం జడ్పీ హైస్కూళ్లలో ఇటీవల జరిగిన హాకీ, ఫెన్సింగ్ పోటీల్లో కాణిపాకం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి హాకీ అండర్-17 పోటీలకు జి.నీలిమ, ఫెన్సింగ్ అండర్-17 పోటీలకు కె.యువశ్రీ, అండర్-14 ఫెన్సింగ్‌కు దేవిప్రియ, ఢిల్లిబాబు, జాన్‌లుక్ ఎంపికయ్యారని హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. వీరిని పీడీలు నాగరాజ,మహారాణి, ఫెన్సింగ్ కోచ్ రాఘవకార్తిక్, టీచర్లతో కలిసి శుక్రవారం అభినందించారు.

తాగునీటి పైపులైను లీకేజీని అరికట్టండి



పాలసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆముదాల పంచాయతీ రంగాపురం గ్రామం వద్ద చిత్తూరు-బలిజ కండ్రిగ తారురోడ్డు కింద వేసిన తాగునీటి పైపులైను పగిలి లీకేజీ అవుతోంది. దాదాపు రెండు నెలలుగా మరమ్మతులు చేయక పోవడంతో ఈ నీటిని వాడుతున్న రంగాపురం, ఆదిఆంధ్రవాడ జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు పారుతుండటంతో రోడ్డుపైనా గుంతలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఆలయ హుండీ చోరీ

పలమనేరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం ముసలిమడుగు వద్ద ఉన్న మారెమ్మ ఆలయంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. మారెమ్మగుడి తలుపులు తీసి, హుండీని పగులగొట్టి అందులోని నగదు తీసుకొని వెళ్లిపోయారు. ముసలి మడుగుకు చెందిన కృష్ణమూర్తినాయుడు తన పొలం వద్ద ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి సమీపంలో షెడ్డులో ఉన్న రెండు పాడి ఆవులను కూడా దొంగలు దొంగిలించుకొని పోయారు.

కుల సంఘాల నేతలతో సమావేశం


కుల సంఘాల నేతల సలహాలను వింటున్న ఈడీ శ్రీదేవి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీ సామాజిక వర్గంలోని వివిధ కుల సంఘాల నేతలతో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. కుల సంఘాల వృత్తులతో పాటు ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సంచార జాతుల వారికి ఇళ్లు, ఆరోగ్యబీమా, స్వయం ఉపాధి, చదువుకున్న పిల్లలకు ఉచితంగా కోచింగ్ తదితర బెనిఫిట్స్‌పై చర్చించారు. తనకు అందిన సలహాలు, సూచనలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపుతానని ఈడీ తెలిపారు.

సంక్షిప్తంగా..

ప్రతి రైతు ఈకేవైసీ చేసుకోవాలి

గుడిపాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మాధవి సూచించారు. శుక్రవారం పాపసముద్రంలోని రైతు సేవా కేంద్రంలో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి తులసీరామ్ రెడ్డి, సర్పంచ్ వళ్ళెమ్మ చిట్టిబాబు, మహేష్, శివలింగా రెడ్డి, పయని, ఐజాక్, రాజేంద్ర, సతీష్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పేదలకు వరం

గుడిపాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరం లాంటిదని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంతో దీపావళికి మహిళలకు ఉచిత సిలిండర్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. టీడీపీ నాయకులు చంద్రబాబు యాదవ్, వాసుదేవరెడ్డి, దొరబాబు యాదవ్, సురేష్ యాదవ్, ధనసింగ్, జయచంద్ర గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ పోషకాలపై అవగాహన

వెదురుకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటలో సూక్ష్మ పోషకాల వాడకంపై అవగాహన అవసరమని కార్వేటినగరం ఏవో హేమలత తెలిపారు. శుక్రవారం కేపీఅగ్రహారం, కృష్ణాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వీఏఏ కుసుమ, రైతులు హాజరయ్యారు.

వాల్మీకి జయంతి వేడుకలు

వెదురుకుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో శుక్రవారం వాల్మీకి జయంతి వేడుకలను జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

సచివాయాల్లో తనిఖీలు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కలిజవేడు, పాపిరెడ్డిపల్లె, వెజ్జుపల్లె సచివాలయాలను ఎంపీడీవో మారం హరిప్రసాద్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

మద్యం విక్రేత అరెస్టు

బంగారుపాళ్యం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఎస్పీ ఆదేశాలతో కరిడివారిపల్లెలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కరిడివారిపల్లెకు చెందిన జయకోడి తన దుకాణంలో మద్యం అక్రమంగా అమ్ముతుండటాన్ని గుర్తించారు. ఆమె వద్ద నుంచి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే శిక్ష తప్పదు

నగరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే శిక్ష తప్పదని నగరి సీఐ మహేశ్వర్ తెలిపారు. వారం రోజులుగా తాగి వాహనాలు నడిపిన వారిపై నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. నగరి మేజిస్ట్రేట్ విష్ణువర్మ.. వారికి జరిమానాలు విధించారు. ఓపెన్ డ్రింకింగ్ కేసుల్లో ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున 17 మందికి రూ.17వేలు, డ్రంకెన్ డ్రైవ్‌కి సంబంధించి ఆరు కేసుల్లో ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున రూ.60వేల జరిమానా విధించారు.

కాలువలు శుభ్రం చేయండి

విజయపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మురుగు కాలువలను శుభ్రం చేయండి అంటూ జంబాడ, కోసలనగరం వాసులు కోరుతున్నారు. కాలువల్లో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉండడంతో మురుగు పారుదల లేక దోమల బెడద ఎక్కువైందన్నారు. అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



వెదురుకుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ సుమలత, హెచ్‌ఎం కేశవులు, ఆశ కార్యకర్తలు లీల, అశ్విని, వ్యాయమ సంచాలకుడు తిరుమలరాజు పాల్గొన్నారు.